సాక్షి ఏలూరు

శనివారం | 2 | మార్చి | 2024



కళలకు నిలయం

కళలకు నిలయంగా క్షీరారామం భాసిల్లుతోంది. పాలకొల్లులో ఆదివారం నుంచి 15వ జాతీయస్థాయి నాటిక పోటీలు నిర్వహించనున్నారు. IIలో



అర్హులందరికీ పక్కా ఇళ్లు

రాష్ట్రంలో అర్హులందరికీ ప్రభుత్వం ఇళ్ల పట్టాలను మంజూరు చేస్తుందని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. IIలో



సొంతింటి కల సాకారం

రాష్ట్రంలో పేదల సొంతింటి కలను సీఎం జగన్ సాకారం చేస్తున్నారని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. IIలో

న్యూస్‌రీల్

శివరాత్రి ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

కలిదిండి: దక్షిణ కాశీగా పేర్గాంచిన కలిదిండి పార్వతీ సమేత పాతాళ భోగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి మహోత్సవ ఏర్పాట్లను ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి శుక్రవారం పరిశీలించారు. వాహనాల పార్కింగ్, ట్రాఫిక్‌పై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూరల్ సీఐ బి.కృష్ణకుమార్‌కు సూచనలు ఇచ్చారు. భక్తులు స్నానమాచరించే కొనేరు వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల 6 నుంచి 10 వరకు ఆలయం వద్ద మహాశివరాత్రి తీర్థం కొనసాగుతుందన్నారు. ఇప్పటికే చలువ పందిర్లు ఏర్పాటు చేశామన్నారు. డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ కృష్ణకుమార్, ఎస్సై ప్రియకుమార్, సిబ్బంది ఆమె వెంట ఉన్నారు.

టెట్‌కు 681 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) పరీక్షలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయి. నాల్గో రోజు శుక్రవారం 681 మంది హాజరయ్యారు. ఉదయం పరీక్షకు 370 మందికి గాను 338 మంది, మధ్యాహ్నం పరీక్షకు 370 మందికి 343 మంది హాజరయ్యారు. పరీక్షల్లో ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం తెలిపారు.

పశ్చిమగోదావరి జిల్లాలో..

భీమవరం: జిల్లాలో శుక్రవారం నిర్వహించిన ఏపీ టెట్ పరీక్షకు 93 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ తెలిపారు. రెండు కేంద్రాల్లో 401 మందికి 373 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, మాల్‌ప్రాక్టీసు కేసులు నమోదు కాలేదని డీఈఓ తెలిపారు.

20 వరకు ఎంఎస్‌ఎంఈ సర్వే

ఏలూరు(మెట్రో): చిన్న, మధ్యతరహా పరిశ్రమలను మరింత ప్రోత్సహించేందుకు ఈనెల 20 వరకు ఎంఎస్‌ఎంఈ సర్వే నిర్వహించనున్నామని, అందరూ సహకరించాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఎంఎస్‌ఎంఈ అవగాహన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల పనితీరును మెరుగుపరిచి డేటా బేస్ అభివృద్ధి చేసేందుకు ఈనెల 20 వరకు జిల్లాలో సర్వే చేస్తారన్నారు. పథకాలపై అవగాహన కల్పించడం, నైపుణ్యాల వృద్ధికి సర్వే దోహదపడుతుందన్నారు. సర్వే ద్వారా పలురకాల ప్రోత్సాహకాలు, బ్యాంకు రుణాలు సులభంగా పొందవచ్చన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పట్టణ ప్రాంతాల్లో ఎమినిటీ సెక్రటరీలు సర్వే చేస్తారని, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్ల ద్వారా సర్వే పురోగతిని పర్యవేక్షిస్తామన్నారు. డీఐసీ జిల్లా పరిశ్రమల అధికారి వి.ఆదిశేషు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల్లో సాగుదారు వివరాలు

జంగారెడ్డిగూడెం: రబీ 2023-24 పంట నమోదు కార్యక్రమం ఫిబ్రవరి 29తో ముగిసినట్టు జిల్లా వ్యవసాయ అధికారి షేక్ హబీబ్ బాషా ప్రకటనలో తెలిపారు. పంట, సాగుదారు వివరాలు సామాజిక తనిఖీ నిమిత్తం రైతు భరోసా కేంద్రాల్లో ఈనెల 3 వరకు ప్రదర్శనకు ఉంచుతామన్నారు. రైతులు వివరాలు సరిచూసుకుని తేడాలు ఉంటే రైతు భరోసా కేంద్రాల్లో అర్జీ అందజేయాలని సూచించారు.

78 శాతం మేర పింఛన్ల పంపిణీ


భీమవరం(ప్రకాశం చౌక్): పశ్చిమగోదావరి జిల్లా తొలిరోజు వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ శుక్రవారం 78 శాతం మేర జరిగింది. జిల్లాలో అన్ని రకాల పింఛన్ లబ్ధిదారులు 2,35,746 ఉండగా వారికి రూ.69.17 కోట్లు అందించాల్సి ఉంది. తొలిరోజు 1,80,000 మందికి రూ.53 కోట్ల మేర అందజేశారు.

టెండర్ల ఆహ్వానం

భీమవరం (ప్రకాశంచౌక్): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాలోని 1,754 పోలింగ్ స్టేషన్లకు స్టేషనరీ సామగ్రి సరఫరా చేయడానికి సీల్డ్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్టు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 7వ తేదీ లోపు కలెక్టరేట్‌లోని కో-ఆర్డినేషన్ సెక్షన్‌లో టెండర్ ఫామ్ పొందాలని పేర్కొన్నారు. సీలు వేసిన టెండర్లు 7వ తేదీ సాయంత్రం 4 గంటల లోపు కలెక్టరేట్‌లోని బాక్స్‌లో వేయాలన్నారు. అదేరోజు సాయంత్రం 5 గంటలకు టెండర్లు తెరిచి ఫైనల్ చేస్తామని పేర్కొన్నారు.

పేదల చదువులకు జగనన్న దీవెనలు

- 32,452 మందికి రూ.26.42 కోట్లు
- కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



ఏలూరు కలెక్టరేట్‌లో విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన చెక్కు అందిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): రాష్ట్రంలో పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా పూర్తిస్థాయిలో ఫీజులను క్రమం తప్పకుండా ఖాతాల్లో జమ చేస్తోందని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. జిల్లాలో అక్టోబర్–డిసెంబర్ 2023 త్రైమాసికానికి సంబంధించి 32,452 మంది విద్యార్థులకు రూ.26.42 కోట్లు విడుదల చేసినట్టు చెప్పారు. ఏలూరు కలెక్టరేట్‌లో శుక్రవారం లబ్ధిదారులకు చెక్కు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల వారీగా ఎస్సీలు 8,052 మందికి రూ.6.15 కోట్లు, ఎస్టీలు 1,478 మందికి రూ.79 లక్షలు, బీసీలు 14,835 మందికి రూ.12.13 కోట్లు, ఈబీసీలు 2,728 మందికి రూ.2.79 కోట్లు, ముస్లిం మైనార్టీలు 852 మందికి రూ.74 లక్షలు, కాపులు 4,137 మందికి రూ.3.35 కోట్లు, క్రిస్టియన్ మైనార్టీలు 370 మందికి రూ.29 లక్షల లబ్ధి చేకూర్చామన్నారు. నియోజకవర్గాల వారీగా ఏలూరు 2,958 మంది విద్యార్థులకు రూ.2.76 కోట్లు, చింతలపూడిలో 5,174 మందికి రూ.4.20 కోట్లు, దెందులూరులో 5,807 మందికి రూ.5.01 కోట్లు, కైకలూరులో 4,146 మందికి రూ.3.30 కోట్లు, నూజివీడులో 5,542 మందికి రూ.4.77 కోట్లు, పోలవరంలో 4,481 మందికి 3.02 కోట్లు, ఉంగుటూరులో 3,175 మందికి రూ.2.47 కోట్లు, ద్వారకతిరుమల మండలంలో 1,169 మందికి రూ.90 లక్షలు జమయ్యాయన్నారు. సోషల్ వెల్ఫేర్ జేడీ జయప్రకాష్, బీసీ సంక్షేమాధికారి ఆర్‌వీ నాగరాణి, మైనార్టీ సంక్షేమాధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లక్ష్యానికి మించి.. పంట రుణాలిచ్చి..

రైతులకు రుణమస్తు

- సకాలంలో అందజేత
- ప్రతి సీజన్‌లోనూ ఆర్థిక తోడ్పాటు
- ఏటా రుణ పరిమితి పెంపు



2022-23లో లక్ష్యం
రూ. 7,410 కోట్లు
రుణాల మంజూరు
రూ. 11,252 కోట్లు

2023-24లో లక్ష్యం
రూ. 11,415 కోట్లు
ఇప్పటివరకు రుణాల మంజూరు
రూ. 9,963 కోట్లు

ఏలూరు(మెట్రో) : రైతులను అన్నివిధాలుగా ఆదుకుంటూ అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం విరివిగా వ్యవసాయ రుణాలు మంజూరు చేస్తోంది. విత్తు నుంచి పంట విక్రయాల వరకు రైతు భరోసా కేంద్రాల ద్వారా తోడ్పాటు అందిస్తూ వ్యవసాయాన్ని పండగ చేస్తోంది. అలాగే సకాలంలో పంట రుణాలిచ్చి భరోసాగా నిలుస్తోంది.

కృత నిశ్చయంతో..

రైతులకు రుణాలు అందించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. బ్యాంకర్లకు ప్రభుత్వమే హామీ ఉంటామంటూ భరోసా కల్పించి రైతులకు పెద్దఎత్తున రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంది. ఏలూరు జిల్లావ్యాప్తంగా సన్న, చిన్నకారు రైతులు 4.50 లక్షలకు పైగా ఉన్నారు. వీరందరికీ పంట రుణాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా యంత్రాంగం, బ్యాంకర్లు చర్యలు తీసుకున్నారు.

3.52 లక్షల మందికి..

జిల్లాలో 3.52 లక్షల మంది రైతులకు లక్ష్యానికి మించి రెండేళ్లుగా రుణాలు అందిస్తున్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.7,410 కోట్ల రుణాలు లక్ష్యంగా కాగా రూ.11,252 కోట్లు అందజేశారు. అలాగే ప్రస్తుత 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.11,415 కోట్ల లక్ష్యాన్ని నిర్ణయించగా ఇప్పటివరకు రూ.9,963 కోట్లు అందజేశారు. ఆర్థిక సంవత్సరం ముగియడానికి నెల రోజులు గడువు ఉండటంతో ఈలోపు లక్ష్యానికి మించి రుణాలందిస్తామని బ్యాంకర్లు చెబుతున్నారు. ప్రతి సీజన్‌లోనూ రైతుల ఆర్థిక అవసరాలు తీర్చేందుకు రుణాలు అందిస్తున్నామని అంటున్నారు. ఇలా రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. తరచూ జిల్లా అధికారులు బ్యాంకర్లతో సమావేశాలు నిర్వహించి రుణాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నారు.

విరివిగా రుణాలు



రైతులకు విరివిగా రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు నిర్ణయించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఉన్న రైతులందరికీ రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. లక్ష్యానికి మించి గత ఆర్థిక సంవత్సరంలో రెండు సీజన్లలో రైతులకు రుణాలు అందించాం. అలాగే ప్రస్తుత ఆర్థికక సంవత్సరంలోనూ లక్ష్యానికి మించి రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటాం.

– డి.నీలాద్రి, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్, ఏలూరు

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



ఏలూరు సీఆర్‌రెడ్డి కళాశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లావ్యాప్తంగా ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఫస్టియర్ విద్యార్థులకు తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ పరీక్షలు జరిగాయి. ఉదయం 9 గంటలకు పరీక్షలు ప్రారంభం కాగా విద్యార్థులు ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు ముందస్తుగా విస్తృత ప్రచారం చేయడంతో విద్యార్థులు నిర్దేశిత సమయం కంటే ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. దీంతో ఒక్క నిమిషం ఆలస్యం నిబంధన కారణంగా ఎవరినీ ఆపిన దాఖలాలు లేవు. పరీక్షలను ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు పర్యవేక్షించాయి.

51 కేంద్రాల్లో..

జిల్లావ్యాప్తంగా 51 కేంద్రాల్లో 16,029 మంది విద్యార్థులకు 15,275 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 13,798 మంది జనరల్ విద్యార్థులకు 13,328 మంది హాజరయ్యారు. 2,231 మంది ఒకేషనల్ విద్యార్థులకు 1,947 మంది హాజరయ్యారు. మొత్తంగా 95 శాతం హాజరు నమోదైంది. పరీక్షల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగలేదని, ప్రశాంతంగా జరిగాయని జిల్లా వృత్తివిద్యా అధికారి, ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల కన్వీనర్ బి.ప్రభాకరరావు తెలిపారు.



రూమ్ నంబర్ సరిచూసుకుంటున్న విద్యార్థులు



పరీక్ష రాసేందుకు కేంద్రంలోకి వెళుతూ..

జిల్లాలో 1,743 పోలింగ్ కేంద్రాలు

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

ఏలూరు(మెట్రో): జిల్లాలో వారం రోజుల్లో ఓటరు చేర్పులు, మార్పులకు, తొలగింపులకు సంబంధించి 7,773 దరఖాస్తులు పరిష్కరించామని, మరో 3,752 పరిష్కార దశలో ఉన్నాయని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. విజయవాడ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఏలూరు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తీసుకున్న చర్యలపై వివరించారు. ఓటర్ల జాబితాపై దినపత్రికల్లో 30 వార్తాంశాలు ప్రచురితం కాగా వాటిపై చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో 1,743 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి ప్రతి పోలింగ్ కేంద్రాన్ని ఏఈఆర్ఓ, ఎస్‌హెచ్‌ఓ, సెక్టార్ ఆఫీసర్లతో పరిశీలిన పూర్తయ్యిందని, కొత్త తహసీల్దార్లను కూడా పరిశీలించమని ఆదేశాలిచ్చామని, రెండు రోజుల్లో ప్రక్రియ పూర్తవుతుందన్నారు. శనివారం సెక్టార్ అధికారులు, 4న ఎన్నికల వ్యయ మోనటరింగ్ కమిటీలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఎపిక్ కార్డుల ముద్రణ, పంపిణీ స్థితి తదితర అంశాలపై మాట్లాడారు. జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ, నూజివీడు, జంగారెడ్డిగూడెం ఆర్డీఓలు వై.భవాని శంకరీ, కె.అద్దయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.ముక్కంటి, కె.భాస్కర్, కలెక్టరేట్ పరిపాలనాధికారి కె.కాశీ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

దమ్మున్న నాయకుడు సీఎం జగన్

విప్ గ్రంధి శ్రీనివాస్



పార్టీ కండువాలు వేసి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న విప్ గ్రంధి శ్రీనివాస్

భీమవరం: ప్రజలకు తన ప్రభుత్వం ద్వారా లబ్ధి చేకూరితేనే రానున్న ఎన్నికల్లో తనకు ఓట్లు వేయాలని కోరే దమ్మున్న నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం భీమవరం క్యాంపు కార్యాలయంలో వీరవాసరం మండలం కొణితివాడకి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీలో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. చంద్రబాబు గతంలో 600 హామీలిచ్చి గద్దెనెక్కిన తర్వాత ఒక్క హామీని కూడా అమలుచేయకుండా మోసం చేశారని దుయ్యబట్టారు. సీఎం జగన్ ఇచ్చిన, ఇవ్వని హామీలను కూడా అమలు చేసి ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి చేరువ చేస్తున్నారన్నారు. చంద్రబాబు దగా, మోసం, వెన్నుపోటు రాజకీయాలకు నిలువుటద్దంకాగా.. విశ్వసనీయత, ఇచ్చిన మాటను కట్టుబడిన నైజం సీఎం జగన్‌ది అన్నారు. కోవిడ్ సమయం సీఎం జగన్ చేపట్టిన చర్యలు ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరన్నారు. ఆ సమయంలో వలంటీర్లు ప్రాణాలకు తెగించి చేసిన సేవలు ప్రశంసనీయమన్నారు. ప్రజలకు సేవ చేయడం బాధ్యతగా భావించి పని చేస్తున్నానన్నారు. చంద్రబాబు మోసాన్ని గ్రహించడం వల్లనే టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని శ్రీనివాస్ స్పష్టం చేశారు. ముందుగా ఇళ్ల సత్యనారాయణ, దొడ్డి రామకృష్ణ, భీశెట్టి దానేశ్వరి, మళ్ల ధనలక్ష్మి, పెంటకోటి మాధవ, చదరం త్రిమూర్తులు, పారమెరశెట్టి పార్వతి, యల్లపు రామసీత, పెంటకోటి పెద అప్పారావు, శాంతకుమారి, ఆళ్ల వీరబాబు, యల్లపు రామారావు తదితరులకు వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాలదుర్గ నాగమల్లేశ్వరరావు, వీరవాసరం మండల అధ్యక్షుడు కడలి ధర్నారావు, కొణితివాడ ఉప సర్పంచ్ నాగరాజు శ్రీనివాసరాజు, అండలూరు పీఏసీఎస్ అధ్యక్షుడు మానుకొండ ప్రదీప్, భీశెట్టి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపిక



విద్యార్థులకు జ్ఞాపిక అందిస్తున్న డీఈఓ వెంకటరమణ

అత్తిలి : భీమవరంలో శుక్రవారం జరిగిన ఈఎండీపీలో భాగంగా జిల్లాస్థాయి ప్రదర్శనలో అత్తిలి మండలం బల్లిపాడు హైస్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన సోలార్ ప్యానల్ క్లీనర్ ప్రాజెక్టు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని హెచ్‌ఎం వైఎస్సార్‌సీఎం దత్ తెలిపారు. ఈ ప్రాజెక్టును ఈనెల 6న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో తమ విద్యార్థులు ప్రదర్శిస్తారన్నారు. 9వ తరగతి విద్యార్థులు కె.రాము, వి.సాయిబాలాజీ, పి.మహేష్‌కిరణ్ ప్రాజెక్టును రూపొందించగా ఉపాధ్యాయులు ఎస్‌కే మల్లేశ్వరరావు, డీఎంజీ ప్రసాద్ మార్గదర్శనం చేశారన్నారు. తమ విద్యార్థులు డీఈఓ ఆర్.వెంకటరమణ చేతులమీదుగా జ్ఞాపిక, అభినందన పత్రం అందుకున్నారన్నారు.

6 నుంచి పొగాకు కొనుగోళ్లు ప్రారంభం

కొయ్యలగూడెం: వర్జీనియా పొగాకు వేలం కొనుగోళ్లు ఈనెల 6 నుంచి ప్రారంభిస్తున్నట్టు కొయ్యలగూడెం వర్జీనియా పొగాకు వేలం కేంద్రం నిర్వహణ అధికారి గ్రేసీ మార్గరేట్ తెలిపారు. గతంలో మార్చి 14 నుంచి విక్రయాలు ప్రారంభమవుతాయని ప్రకటించామని, అయితే రైతుల కోరిక మేరకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్, ఈడీ ఎ.శ్రీధర్‌బాబు తేదీలు మార్పు చేశారన్నారు. ఎన్‌ఎల్‌ఎస్ పరిధిలోని అన్ని వేలం కేంద్రాల్లో అదేరోజు కొనుగోళ్లు ప్రారంభమవుతాయని, రైతులు అధికారులు సూచించిన విధంగా బేళ్లను సిద్ధం చేసుకోవాలని సూచించారు.

కాళీపట్నం భూములకు మోక్షం

నేడు పట్టాల పంపిణీ



కాళీపట్నం భూములు

మొగల్తూరు: కాళీపట్నం భూముల్లో సాగు చేసుకుంటున్న రైతులకు శనివారం చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు చేతులమీదుగా పట్టాలు పంపిణీ చేయనున్నారు. దశాబ్దాల సమస్యను చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లడంతో స్పందించిన ఆయన 1585 జీఓను ఉపసంహరించి జీఓ 7ను విడుదల చేశారు. దీని ఆధారంగా 1945 నాటికి కాళీపట్నం భూములపై సాగు చేసుకునే రైతులకు అవకాశం కలగడంతో ఇటీవల రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. ఈ మేరకు సాగు చేసుకునే రైతులకు పట్టాలు పంపిణీ చేయనున్నారు. సుమారు 5 వేల ఎకరాలకు సంబంధించి పట్టాలు అందజేయనున్నారు. చీఫ్ విప్ ప్రసాదరాజు కృషితో కాళీపట్నం భూముల సమస్య పరిష్కారం కావడంపై కాళీపట్నం రెవెన్యూ గ్రామాల పరిధి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే నరసాపురం మండలం దర్బరేవు కంపెనీ భూముల సమస్యను కూడా ప్రసాదరాజు పరిష్కరించారని అంటున్నారు.

84 వేల ఓటరు కార్డుల పంపిణీ

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో ఇప్పటివరకు 84,324 ఓటరు కార్డులను పోస్టల్ ద్వారా పంపిణీ చేశామని, మిగిలిన కార్డులు ప్రింటింగ్ పూర్తయిన వెంటనే పంపిణీకి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. విజయవాడ నుంచి శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్‌మీనా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. భీమవరం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బీఎల్‌ఓల శిక్షణ పూర్తయ్యిందని, రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించామన్నారు. జిల్లాలో ఎన్నికలకు సంబంధించి రెండు ఫిర్యాదులు రాగా ఒకటి పరిష్కరించామని, మరొకటి త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. జిల్లాలో ఫాం-6,7,8కి సంబంధించి మొత్తం 36,537 అందగా 26,504ను ఆమోదించామని, 2,300 తిరస్కించామన్నారు. ఇంకా 6,733 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇన్‌చార్జి డీఆర్వో బి.శివన్నారాయణరెడ్డి, ఆర్డీఓ బి.శ్రీనివాసులు రాజు పాల్గొన్నారు.

కళలకు నిలయం..క్షీరారామం

రేపటి నుంచి పాలకొల్లులో 15వ జాతీయ స్థాయి నాటికల పోటీలు

పాలకొల్లు సెంట్రల్: కళలకు నిలయంగా కళాకారులకు ఆలయంగా క్షీరారామం బాసిల్లుతోంది. పాలకొల్లును క్షీరారామంగా కళాకారులు పేర్కొంటూ ఉంటారు. క్షీరారామలింగేశ్వరుడు కొలువైన ప్రాంతం కాబట్టి క్షీరారామం అనే నానుడి ఎప్పటి నుంచో ఉంది. ఇంతటి ప్రాశస్త్యం ఉన్న పాలకొల్లులో ఆదివారం నుంచి 15వ జాతీయ స్థాయి నాటికల పోటీలు నిర్వహించనున్నారు. సమాజాన్ని చైతన్యపరిచే ఏకైక సాధనం నాటకం . నాటక రంగానికి పుట్టినిల్లుగా పేర్కొనే పాలకొల్లులో గత 60 ఏళ్లుగా జాతీయ స్థాయి నాటికల పోటీలు నిర్వహిస్తూనే ఉన్నారు. గతంలో మహాత్మా మిత్ర బృందం, మిత్ర బృందం, సంగీత నాటక అకాడమీ, దాసరి నారాయణ రావు కల్చరల్ అకాడమీ, క్షీరపురి నాటక అకాడమీ, లలిత కళాంజలి నాటక అకాడమీల ఆధ్వర్యంలో జాతీయ స్థాయి నాటికల పోటీలు నిర్వహించి కళాకారులను ప్రోత్సహిస్తూ వచ్చారు. దానితో తెలుగు నాటక రంగం తనకంటూ ఓ సుస్థిరస్థానాన్ని, కీర్తి ప్రతిష్టలను సాధించుకుంది.

గత నాటక అకాడమీల స్పూర్తితో గత 15 ఏళ్ల నుండి పాలకొల్లు కళాపరిషత్ పేరున జాతీయ స్థాయి నాటికల పోటీలు నిర్వహిస్తున్నాయి. అలాగే కొంత మంది కళాప్రియులను స్మరించుకుంటూ చలం స్మారక నాటకోత్సవం, అల్లు రామలింగయ్య, పినిశెట్టి శ్రీరామమూర్తి, ఈవీవీ సత్యనారాయణ, వంగా అప్పారావు, దాసరి నారాయణరావు, కోడి రామకృష్ణ, కలిదిండి రఘురామరాజు, విన్నకోట వెంకటేశ్వరరావుల పేరున జాతీయ స్థాయి స్మారక నాటకోత్సవాలు నిర్వహిస్తూ వారిని స్మరించుకునేవారు. ఉమ్మడి తెలుగురాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన రంగస్థల ప్రముఖులు నాయుడు గోపి, వైఎస్ కృష్ణేశ్వరరావు, గంగోత్రి సాయి, ఎస్ రవీంద్రరెడ్డి, గోపరాజు రమణ వంటి రంగస్థల ప్రముఖులు ప్రదర్శించిన నాటికలకు పాలకొల్లు కళాపరిషత్ ద్వారా అనేక బహుమతులను గెలుచుకున్నారు. వీరితో పాటు మరింత మంది కళాకారులను ప్రోత్సహించాలనే సదుద్దేశంతో గత 15 ఏళ్లుగా పాలకొల్లు కళాపరిషత్ ఏర్పాటుచేసి నాటిక పోటీలను నిర్వహిస్తున్నారు.


ఉత్తమ బహుమతి పొందిన అభినయ ఆర్ట్స్, అతీతం నాటిక (ఫైల్)


ద్వితీయ బహుమతి పొందిన రాఘవ మూవీ మేకర్స్ వారి కెరటాలు (ఫైల్)

పోటీల నిర్వహణ ఇలా

పాలకొల్లు కళాపరిషత్ ఆధ్వర్యంలో మార్చి 3,4,5 తేదీల్లో 15వ జాతీయ స్థాయి నాటిక పోటీలు ప్రారంభంకానున్నాయి. స్థానిక అద్దేపల్లి వారి సత్రం ప్రాంగణంలో నాటికలు నిర్వహించనున్నారు. మార్చి 3 ఆదివారం రాత్రి 8 గంటల నుండి చైతన్య కళాభారతి, కరీంనగర్ వారి స్వప్నం రాల్చిన అమృతం నాటిక, విటిపిఎస్ కల్చరల్ అసోసియేషన్, ఇబ్రహీంపట్నం (విజయవాడ) వారి ఎనిమీ నాటిక, మార్చి 4 సోమవారం వెలగలేరు థియేటర్స్ ఆర్ట్స్, వెలగలేరు వారి రాత నాటిక, అరవింద్ ఆర్ట్స్, తాడేపల్లి వారి మనస్విని నాటిక, ఉషోదయ కళానికేతన్, కట్రపాడు వారి విముక్తి నాటిక, మార్చి 5 మంగళవారం అభినయ ఆర్ట్స్, గుంటూరు వారి ఇంద్రప్రస్థం నాటిక, గోవాడ క్రియేషన్స్, హైదరాబాద్ వారి మూల్యం నాటిక ప్రదర్శించబడుతుంది. అనంతరం బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు.

కళలను ప్రోత్సహించడమే లక్ష్యం



కళలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ కళాపరిషత్ నిర్వహిస్తున్నాం. కళాప్రియుల ప్రోత్సాహం వల్ల నేటికి కళలకు ఆదరణ తగ్గలేదనే చెప్పాలి. ఇలాంటి నాటక కళాపరిషత్‌ల ద్వారా పాలకొల్లు నుంచి ఎంతో మంది కళాకారులు తమ ప్రతిభను చాటుకుని అగ్ర దర్శకులు, నటులుగా గుర్తింపు పొందారు.

– కేతు కృష్ణవర్మ, అధ్యక్షుడు, పాలకొల్లు కళాపరిషత్

పాలకొల్లుకు గుర్తింపు



నాటక రంగంలో పాలకొల్లుకు ప్రత్యేక గుర్తింపు ఉంది. నేను ప్రదర్శించిన అనేక నాటికలకు బహుమతులు అందుకోవడం పాలకొల్లు బిడ్డగా గర్వపడుతున్నాను. ఇటీవల గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిర్‌లో నిర్వహించిన నంది నాటకోత్సవాల్లో బాలల నాటక విభాగానికి న్యాయ నిర్ణేతగా వ్యవహరించి నంది అవార్డు కూడా అందుకున్నాను.

– మానాపురం సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి, పాలకొల్లు కళాపరిషత్

క్లుప్తంగా

గంజాయి విక్రేతల అరెస్ట్


గంజాయి తరలింపుదారులతో పోలీసులు

ముసునూరు: యువకులను, కళాశాలల విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని, గంజాయి విక్రయాలు నిర్వహిస్తున్న ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై పి.వాసు తెలిపారు. శుక్రవారం ఏలూరు నుంచి నూజివీడుకు, చిల్లబోయినపల్లి మీదుగా గంజాయిని తరలిస్తున్న ముగ్గురు యువకులు చింతం విజయ్‌బాబు(27), షేక్ మొహిద్దీన్(23), షేక్ మెహరా(20) లను బైక్‌తో సహా పట్టుకుని, ముసునూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తరలింపుదారులు ముగ్గురూ నూజివీడుకు చెందిన వారుగా తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ ఎమిలీ కుమారి సమక్షంలో నిందితుల వద్ద నుంచి రెండు కిలోల గంజాయిని, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రవాణా, విక్రయాలపై నూజివీడు సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పూర్తి స్థాయి విచారణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కుల గణనను వ్యతిరేకించడం దుర్మార్గం

ద్వారకాతిరుమల: రాష్ట్రంలో ఆర్ఎస్ఎస్ కుల గణనను వ్యతిరేకించడం దుర్మార్గమని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశవ శంకరరావు అన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని కేశవ శంకరరావుతో పాటు సంఘ నాయకులు శుక్రవారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన వీరు ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో పండితుల నుంచి వేద ఆశీర్వచనాన్ని పొందారు. అనంతరం కొండపైన ఒక అతిథి గృహంలో కేశవ శంకరరావు మీడియాతో మాట్లాడారు. దేశంలో అన్నింటికి లెక్కలున్నాయని, తమ కులాన్ని లెక్కించే విషయంలో ఆర్ఎస్ఎస్‌కు వచ్చిన ఇబ్బంది ఏమిటో తెలియడం లేదన్నారు. సంఘ రాష్ట్ర యువజన అధ్యక్షులు కుమ్మర క్రాంతి కుమార్, యువజన ఉపాధ్యక్షులు గుర్రం ద్వారకాశ్రీను, ఉపాధ్యక్షులు పరసా వీర్రాజు, కార్యదర్శి మిడతా చందు, తూర్పుగోదావరి జిల్లా సంఘ అధ్యక్షులు వంక మల్లిబాబు, క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

మహిళల సాధికారతే లక్ష్యం


ఏలూరు కలెక్టరేట్‌లో సమీక్షిస్తున్న మెప్మా ఏపీ మిషన్ డైరెక్టర్ విజయలక్ష్మి, మెప్మా పీడీ ఇమ్మానుయేల్

ఏలూరు టౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళలు ఆర్థిక స్వావలంబనకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ వారి కుటుంబాలను పోషించుకునే స్థాయికి ఎదిగేలా ప్రోత్సాహాన్ని అందిస్తున్నారనీ, స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మెప్మా ఏపీ మిషనర్ డైరెక్టర్ విజయలక్ష్మి అన్నారు. ఏలూరు కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో శుక్రవారం సమీక్షించారు. ఏలూరు జిల్లాలోని ఏలూరు నగరపాలక సంస్థ, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, నూజివీడు పురపాలక సంఘాల్లోని మెప్మా అధికారులు, సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు, సీవోలు, ఆర్పీలతో ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్‌హెచ్‌జీ గ్రూపుల్లోని మహిళలతో మాట్లాడి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఐదేళ్ళ కాలంలో గ్రూపుల్లోని మహిళలు సాధించిన ఆర్థిక పురోభివృద్ధిపై ఆరా తీశారు. మెప్మా పీడీ బీ.ఇమ్మానుయేల్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. సమీక్షలో మెప్మా పీడీ ఇమ్మానుయేలు, ఏవో రామాంజనేయులు, సీఎంఎం కే.సుధాకర్‌రావు, ఎస్ఎంఎం ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అర్హులందరికీ పక్కా ఇళ్లు

చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: అర్హులైన వారందరికీ ప్రభుత్వం ఇళ్ల పట్టాలను మంజూరు చేస్తుందని ఎమ్మెల్యే ప్రసాదరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని పెదలంక, వేములదీవి పడమర, వేములదీవి తూర్పు తదితర సంబందించి గతంలో ఇచ్చిన ఇళ్ల పట్టాలను పూర్తి హక్కులు కల్పిస్తూ రిజిస్ట్రేషన్ చేసి లబ్ధిరులకు ప్రసాదరాజు అందించారు. ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చిన డాక్యుమెంట్‌లపై లబ్ధిదారుడు పూర్తి హక్కులను కలిగి ఉంటారని ఆయన అన్నారు. వారసులకు ఇవ్వడానికి, బ్యాంకు రుణాలు పొందడానికి ఎటువంటి ఆటంకాలు ఉండవని ఆయన వివరించారు. మండలంలోని సారవ, వేములదీవి పడమర, వేముదీవి తూర్పు గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. తొలుత మండలంలోని సారవ గ్రామంలో రూ.4.66 కోట్లతో పెద సారవ గ్రామంలోని ఆర్అండ్‌బి రహదారి నుంచి గాంధీ నగర్ మీదుగా పెదలంక వరకూ నిర్మించే రహదారి, వేములదీవి పడమరలో రూ.33 లక్షలతో నిర్మించే ఓవర్ హెడ్ ట్యాంకు, మంచినీటి సరఫరా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ తిరుమాని నాగరాజు, జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ, ఎంపీపీ మైలా బత్తుల సోని పాల్గొన్నారు.

దూర ప్రాంతాలకు వెళ్లి పింఛన్ అందజేత

ఆగిరిపల్లి: మండలంలోని తోటపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు మండవ రాణి ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో మోకాలు ఆపరేషన్ చేయించుకుంది. ఈ విషయం తెలిసిన గ్రామానికి చెందిన వలంటీర్ మొక్కపాటి సాహితీ శుక్రవారం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పెన్షన్ అందజేసింది. ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కి జీవితాంతం రుణపడి ఉంటామని ఆమె ఆనందం వ్యక్తం చేసింది.

ఉంగుటూరులో..

ఉంగుటూరు: మండలంలోని కై కరం గ్రామానికి చెందిన గంజి మోష్‌కి పెరాలసిస్ వచ్చింది. ఈ నేపథ్యంలో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం పొందుతున్నాడు. శుక్రవారం పింఛన్ అందించేందుకు వెళ్లిన వలంటీర్ మాధురి విషయం తెలుసుకుని ఏలూరు వెళ్లి పింఛన్ అందించింది.

కొవ్వలిలో..

దెందులూరు: కొవ్వలి గ్రామానికి చెందిన పింఛన్‌దారుడు కఠారి వెంకటేశ్వరరావుకు అనారోగ్యం రీత్యా కాలు తొలగించారు. ఏలూరులో మురళీకృష్ణ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకటేశ్వరావుకు కొవ్వలి నుంచి ఏలూరు మురళీకృష్ణ ఆసుపత్రికి వెళ్లి వలంటీర్ షేక్ జానీ వెళ్ళి పెన్షన్ నగదు రూ. 3 వేలు, నూతన ఆరోగ్యశ్రీ కార్డును అందజేశారు. ఆయన వెంట గొల్లా రమేష్ తదితరులున్నారు.


ఆగిరిపల్లి: ఖమ్మం వెళ్ల వృద్ధురాలికి పెన్షన్ అందిస్తున్న వలంటర్ మొక్కపాటి సాహితి

కేంద్రమంత్రిని కలిసిన అప్పడా రఘురాం


కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాలాతో అప్పడా వైస్‌చైర్మన్ వడ్డి రఘురాం

తాడేపల్లిగూడెం: అప్పడా వైస్‌చైర్మన్ వడ్డి రఘురాం గురువారం ఢిల్లీలో కేంద్ర ఫిషరీస్ శాఖా మంత్రి పురుషోత్తం రూపాలాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వా కల్చర్ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆక్వా రంగంలో కొత్త కొత్త సంస్కరణలు తీసుకొచ్చి ఆక్వా రంగం బలోపేతానికి చర్యలు తీసుకున్నారని కేంద్ర మంత్రికి తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు రూ.3420 కోట్లు సబ్సిడీ ద్వారా ఆక్వా రైతులకు అందించామన్నారు. ఆక్వా రంగానికి కేంద్ర ప్రభుత్వం నుంచి కావాల్సిన సహకారం గురించి చర్చించారు. అనంతరం నీతిఆయోగ్ సీఈఓ పీవీఆర్ సుబ్రహ్మణ్యం, సలహాదారు నీలిమా పటేల్‌ను కలిశఋూరు. ఈ నెల 15,16 తేదీల్లో విశాఖపట్టణంలో నీతిఆయోగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆక్వా సెమినార్ విశేషాలపై చర్చించారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో ప్రతిభ

దెందులూరు: చెన్నైలోని జప్పర్ యూనివర్శిటీలో ఛాంపియన్ ఆఫ్ ఛాంపియన్ బాడీ బిల్డింగ్ పోటీల్లో జూనియర్ మిస్టర్ ఇండియాగా రామారావు గూడేనికి చెందిన పోదుమల్లి పవన్ గోల్డ్ మెడల్ సాధించారు. గత నెల 26న నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపి శుక్రవారం గ్రామానికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో ఏలూరులో రామలక్ష్మణ్ జిమ్ యాజమాన్యంతో పాటు రామారావుగూడెం గ్రామస్తులు పవన్‌కు అభినందనలు తెలిపారు. పవన్ గత నెల 13న కేరళలో నిర్వహించిన పోటీల్లో కూడా ఆల్ ఇండియా చాంపియన్‌గా నిలిచాడు.

సొంతింటి కల జగన్‌తో సాకారం


జిల్లేళ్లగూడెంలో ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న నాయకులు

పోలవరం రూరల్: పేదల సొంతింటి కలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాయంతో సాకారం చేసుకున్నారని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. పోలవరం మండలంలో పలు అభివృద్ధి శంకుస్థాపన కార్యక్రమాలను ఆయన నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి, ఏలూరు పార్లమెంట్ సమన్వయకర్త కారుమూరి సునీల్‌కుమార్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. కొండ్రుకోట, ఎల్ఎన్‌డీపేట, జిల్లేళ్లగూడెం, ప్రగఢపల్లి, వింజరం, పోలవరం గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, హెల్త్ క్లినిక్‌లు, షాపింగ్ కాంప్లెక్స్ తదితర పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. మండలంలో రూ. 4.67కోట్లతో నిర్మాణాలు పూర్తి చేసిన భవనాలను ప్రారంభించారు. అలాగే ఎల్ఎన్‌డీపేట పీహెచ్‌సీలో రూ. 50లక్షల నిధులతో నిర్మించే అదనపు భవనానికి శంకుస్థాపన చేపట్టారు. జిల్లెళ్లగూడెం గ్రామంలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థ , వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలను నేరుగా ఇంటికే అందించారన్నారు. ఏలూరు పార్లమెంట్ ఇన్‌ఛార్జ్ కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తెల్లం రాజ్యలక్ష్మిలకు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. చేగొండిపల్లి గ్రామంలో యువతకు క్రికెట్ కిట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, జెడ్పీటీసీ కలుం హేమకుమారి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బుగ్గా మురళీకృష్ణ పాల్గొన్నారు.

పరీక్ష రాసేందుకు వెళుతూ..


ప్రమాదంలో మృతి చెందిన పలగాని లావణ్య

పెదవేగి: మండలంలోని వంగూరు ఎఫ్‌సీఐ గోడౌన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువతి అక్కడికక్కడే మృతి చెందింది. పెదవేగి ఎస్సై వి.రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం బి.సింగవరం గ్రామానికి చెందిన పలగాని లావణ్య ఏలూరు ఎన్ఆర్ఐ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. శుక్రవారం లావణ్య పరీక్షలు రాసేందుకు బి.సింగవరం నుంచి తన బంధువుకు చెందిన ద్విచక్ర వాహనం పై ఏలూరుకు బయలుదేరింది. లావణ్య ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని వంగూరు ఎఫ్‌సీ: గోడౌన్ దగ్గర లోపలికి వెళుతున్న లారీ ఎదురుగా ఢీకొట్టింది. దీంతో లావణ్య తలకు బలమైన గాయమై ప్రమాద స్థలంలోనే మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజేంద్రప్రసాద్ తెలిపారు.

పింఛను సొమ్ము కాజేసిన మోసగాడు



మోసపోయిన వృద్ధులు , సీసీ కెమెరాలో నమోదైన అనుమానాస్పద వ్యక్తి

తణుకు: వృద్ధులకు మాయమాటలు చెప్పి ఓ గుర్తుతెలియని వ్యక్తి ముగ్గురు వృద్ధుల వద్ద రూ.9 వేలు కాజేసిన ఘటన శుక్రవారం తణుకు పట్టణంలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని స్థానిక బ్యాంకు కాలనీకి చెందిన మండేపూడి పద్మ, మండేపూడి సూర్యకాంతం, గొల్లి సావిత్రి పక్కపక్కనే ఇళ్లలో నివాసం ఉంటున్నారు. శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో వార్డు వలంటీర్ సూరిబాబు వచ్చి రూ.3 వేల చొప్పున ముగ్గురు వృద్ధులకు పింఛను సొమ్ము ఇచ్చి వెళ్లాడు. ఆ తర్వాత సుమారు 12 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి తనను కలెక్టర్ పంపారని, తాను ఉన్నతాధికారినని పరిచయం చేసుకున్నాడు. మీకు ఇళ్లు కట్టుకునేందుకు రూ.4 లక్షలు చొప్పున రుణం మంజూరైందంటూ నమ్మబలికాడు. అలాగే పింఛను సొమ్ము ఈ నెల నుంచి రూ.6 వేలకు పెంచారని, రూ.3 వేలు ఇవ్వడమేంటి? అని ప్రశ్నించాడు. సచివాలయానికి వచ్చి అడుగుతానని చెప్పి.. మీ వద్ద ఉన్న రూ.9 వేలు ఇవ్వండని అడిగి తీసుకున్నాడు. ఆఫీసుకు వెళ్లి మాట్లాడి రూ.18 వేలు తెచ్చిస్తానని చెప్పి ఆధార్ కార్డు జిరాక్సులు తీసుకురమ్మని చెప్పాడు. దీంతో ముగ్గురూ వీధి చివరనున్న జిరాక్సు షాపునకు వెళ్లి తిరిగి వచ్చేసరికి పరారయ్యాడు. సమీపంలోని ప్రగతి కళాశాలకు చెందిన సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలను పోలీసులుపఏ పరిశీలిస్తున్నారు. ఈ ఘటనపై విచారణ చేపట్టామని సీఐ నాగరాజు తెలిపారు.

ఆశ్రమ పాఠశాల వార్డెన్ సస్పెన్షన్

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): ఇటీవల జీలుగుమిల్లి గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాల వసతి గృహంలో విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటనపై వసతి గృహం వార్డెన్ నవీన్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు అందించినట్లు ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. రాజుకు అభియోగాలు మోపుతూ నోటీస్ జారీ చేసి ఎంక్వైరీ అధికారిని నియమించామని పేర్కొన్నారు. ఎంక్వైరీ అనంతరం క్రమ శిక్షణ చర్యలు తీసుకుంటామని వివరించారు. అదేవిధంగా ఏటీడబ్ల్యూఓగా పనిచేస్తున్న కె.కృష్ణమోహన్‌కు కూడా క్రమశిక్షణ చర్యల నిమిత్తం సంచాలకులు, గిరిజన సంక్షేమం ఏపీ విజయవాడకు సిఫార్సు చేసినట్లు తెలిపారు. జీలుగుమిల్లి గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాల(బాలురు) సంఘటనపైనే కాకుండా పర్యవేక్షణ లోపం, వివిధ అంశాలలో అలసత్వం చూపించినందున కృష్ణమోహన్‌పై క్రమశిక్షణ చర్యల నిమిత్తం సిఫార్సు చేశామని వివరించారు. ఆహార పదార్ధాల నాణ్యత విషయంలో టెండర్‌దారుని నోటీసులిచ్చామన్నారు.